

ఎన్‌కౌంటర్‌లో స్వాధీనం చేసుకున్న తుపాకీని పరిశీలిస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

సంభవ్.. కొనసాగింపు!

- 'ఆపరేషన్ సంభవ్' కొనసాగుతుందన్న డీజీపీ గుప్తా
- తూర్పు ఏజెన్సీలో వచ్చే ఏడాది మార్చి దాకా కూంబింగ్
- అడవుల్లో జల్లెడపడుతున్న కేంద్ర, రాష్ట్ర బలగాలు
- పర్యాటకరంగంపై కొంత ప్రభావం

(రంపచోడవరం/ఆంధ్రజ్యోతి)

మారేడుమిల్లి అంటే ఇప్పుడు చక్కటి పర్యాటక కేంద్రం. తెలుగురాష్ట్రాల నుంచి పెద్దఎత్తున ఇక్కడి అడవుల్లో పర్యటించేందుకు నిరంతరం వస్తుంటారు. వాగులువంకలు, దట్టమైన అడవులతో పచ్చని లోకాన్ని ఈ ప్రాంతం తలపిస్తుంది. అయితే రెండు దశాబ్దాల కిందట నక్సల్బరి ఉద్యమంలో కీలక నేతలకు ఈ ఏజెన్సీ ఒక షెల్టర్. తాము మారేడుమిల్లి అడవుల్లోనే ఆయుధ సామగ్రిని తయారుచేసే వారమని ఉద్యమం నుంచి బయటకు వచ్చిన టెక్ మధు ఇటీవల ఓ డిబేట్‌లో చెప్పారు. అంటే ఇది నక్సల్ ఉద్యమంలోనే కాకుండా ఆయుధ సంపత్తిని తయారుచేసే కేంద్రంగానూ ఉండేదని తెలుస్తోంది. సాంకేతికపరమైన శిక్షణ కోసం తూర్పు ఏజెన్సీ ముఖ్య కేంద్రంగానూ ఎంచుకున్నట్టు మాజీ నక్సలైట్లు అందించే సమాచారం తేటతెల్లం చేస్తోంది. ఏజెన్సీలో ఇరవైయేళ్ల కిందట ఐఏఎస్‌ల కిడ్నాప్ తర్వాత భారీగా కూంబింగ్ జరగడంతో ఏజెన్సీ నుంచి నక్సలైట్లు సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. కానీ ఈ ఏడాదిలో మళ్లీ ఇప్పటివరకు జరిగిన నాలుగు ఎన్‌కౌంటర్లు నాటి రోజులను తలపిస్తున్నాయి. ఇక అల్లూరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఏడాది కాలంగా ముమ్మరంగా కూంబింగ్ జరుగుతోంది. తాజా ఘటనల నేపథ్యంలో చేపట్టిన కూంబింగ్ 'ఆపరేషన్ సంభవ్' మూడ్రోజుల తర్వాత ముగిసిందని ఎస్పీ అమిత్ బర్దర్ ప్రకటించారు. అయితే 'ఆపరేషన్ సంభవ్' 2026మార్చి వరకు కొనసాగుతుందని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ప్రకటించారు. గురువారం ఆయన రంపచోడవరంలో మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో వినియోగించిన ఆయుధాలను పరిశీలించారు. ఈ సందర్భంలోనే కేంద్రం నిర్దేశించిన లక్ష్యం మేరకు రాష్ట్రంలో మావోయిస్టుల అలజడి లేకుండా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టంచేశారు. దీంతో రంపచోడవరం ఏజెన్సీలో ఇకపై ముమ్మరంగా కూంబింగ్ జరుగనుందని అర్థమవుతోంది. ఇప్పటివరకు రంపచోడవరం ఏజెన్సీలో ప్రశాంతమైన వాతావరణం ఉండి పర్యాటకులకు విడిదిగా విలసిల్లుతుండగా.. కొద్ది నెలలపాటు భద్రతా దళాల బూట్ల చప్పుళ్లు, నిఘా వర్గాల కదలికలు, పోలీసు ఉన్నతాధికారుల పర్యటనలతో కొంత ఆందోళనకర పరిస్థితులు నెలకొనే అవకాశం కనిపిస్తోంది. అదేవిధంగా ఏజెన్సీతోపాటు సమీపంలోని మైదాన ప్రాంతాల్లో ఆశ్రయం పొందుతున్న మావోయిస్టుల గాలింపు చర్యలు సైతం ముమ్మరంగా సాగాలని డీజీపీ ఆదేశాలివ్వడంతో ఆమేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనూ విస్తృత తనిఖీలకు దిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో పర్యాటకుల తాకిడిపై కొంత ప్రభావం చూపనుంది. కొంత కాలం ఈ ప్రభావం ఉండే అవకాశం ఉంది.



నాడు గాలికి.. నేడు దారికి..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణానికి నోచుకోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు మంచిరోజులు వచ్చాయి. అప్పట్లో వీటికి కేంద్రం ఇచ్చిన నిధులను దారిమళ్లించి భవనాల నిర్మాణాన్ని గాలికి వదిలేయడంతో అవన్నీ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. అయితే ఇప్పుడు ప్రభుత్వం వీటికి శాశ్వత భవనాలు నిర్మించడానికి ముందుకు వచ్చింది. అసంపూర్తిగా వదిలేసిన వాటిని, అసలు భవనాలే లేని క్లినిక్‌లకు శాశ్వత భవనాలు సమకూర్చాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో 39 క్లినిక్‌లకు శాశ్వత భవనాలకు రూ.11.50 కోట్ల నిధులు కేటాయించింది. మరో వారంలో కోనసీమలో 56 భవనాలకు రూ.23 కోట్లు కేటాయించబోతోంది. ఇక తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలకు రూ.12 కోట్లతో మరిన్ని భవనాల నిర్మాణం చేపట్టడానికి సన్నద్ధం చేస్తున్నారు. ప్రతి గ్రామంలో వీటి నిర్మాణం ద్వారా పేదలకు ఇంటికి సమీపంలోనే వైద్య సేవలు అందేలా చేయడానికి కేంద్రం వీటిని ప్రవేశపెట్టింది. మరోవైపు విలేజ్ క్లినిక్‌ల ద్వారా సమర్థవంతంగా వైద్య సేవలు అందించేలా రాష్ట్రప్రభుత్వం నడుం బిగించింది.

- ఉమ్మడి జిల్లాలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు మంచి రోజులు
- వీటికి శాశ్వత భవనాలు సమకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- కాకినాడ, కోనసీమల్లో 39 హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి రూ.11.50 కోట్లతో టెండర్లు
- మరో వారంలో కోనసీమలో రూ.23 కోట్లతో 56 క్లినిక్‌లకు టెండర్ల జారీ
- తూర్పు, కాకినాడ జిల్లాల్లో మరో రూ.12 కోట్లతో భవనాల నిర్మాణానికీ సన్నద్ధం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు ప్రారంభించింది. వీటిలో పేదలకు 14 రకాల వైద్య సేవలు అందుతాయని ప్రకటించింది. అందులోభాగంగా ఉమ్మడి జిల్లాలో 1,050కిపైగా వీటిని మంజూరు చేసింది. ఇందులో కాకినాడ జిల్లాలో 410, తూర్పుగోదావరి జిల్లాలో 368 వరకు ఉన్నాయి. అయితే వీటిలో సగం క్లినిక్‌లకు శాశ్వత భవనాలే లేవు. చాలావరకు సచివాలయాలు, పంచాయతీల్లో నిర్వహించి అప్పటి వైసీపీ ప్రభుత్వం చేతులు దులిపేసుకుంది. నిజానికి వీటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. చివరకు వీటిని కూడా అప్పటి జగన్ సర్కారు నిధులు దారి మళ్లించేసింది. దీంతో అనేక క్లినిక్‌లకు ఇప్పటికీ శాశ్వత భవనాలు లేవు. ఉమ్మడి జిల్లాలో సగానికిపైగా క్లినిక్‌లకు అసలు ఇప్పటికీ సొంత భవనాలు లేక అద్దె, లేదా వేరే పంచన నడుస్తున్నాయి. దీంతో సేవలు కూడా గ్రామీణ ప్రజలకు సరిగ్గా అందని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం వీటిపై దృష్టిసారించింది. వీటికి శాశ్వత భవనాలు సమకూర్చాలని నిర్ణయించింది. అందులో భాగంగా కేంద్రంతో మాట్లాడి నిధులు రప్పించింది. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి కేంద్రం 80 శాతం వరకు నిధులు సమకూర్చుతోంది. వీటిని 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్' పేరు నామకరణం చేసింది. ఇందులోభాగంగా అసంపూర్తిగా ఉన్నవి, అద్దె భవనాల్లో ఉన్న వాటికి శాశ్వత భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో తాజాగా 39 హెల్త్‌క్లినిక్‌లకు శాశ్వత భవనాలు మంజూరు చేస్తూ రూ.11.50 కోట్లు విడుదల చేసింది. తుని మండలం ఎస్.అన్నవరం4 క్లినిక్‌కు రూ.28.98 లక్షలు, ఎస్.అన్నవరం-1కు రూ.29.09 లక్షలు, పిఠాపురం మండలంలో నరసింగపురం క్లినిక్‌కు రూ.29.37లక్షలు, గొల్లప్రోలు మండలం మల్లవరం రూ.29.36 లక్షలు, తాటిపర్తి రూ.29.12, తాటిపర్తి-2 రూ.29.13 లక్షలు, పెదపూడి మండలం గండ్రేడు రూ.27.87, రాజుపాలెం రూ.27.75, ఏపీత్రయం రూ.29.69, దోమాడ రూ.27.06, కాజులూరు మండలం కోలంక-2 రూ.29.34 లక్షలు, ఉప్పుమిల్లి రూ.29.59, పల్లిపాలెం2 రూ.29.19, ప్రత్తిపాడు మండలం శంకర్లపూడి రూ.29.03 లక్షలు, ఏలేశ్వరం మండలం ఎర్రవరం-1 రూ.28.83, లంపకలోవ రూ.29.03, సామర్లకోట మండలం వేట్లపాలెం-1 రూ.29.05, మాధవపట్నం రూ.29.24, పెద్దాపురం మండలం కాండ్రకోట రూ.28.68లక్షలు, మర్లోవ రూ.28.85, కరప మండలం పెనుగుదురు రూ.29.51 లక్షలు, కరప రూ.29.36, రౌతులపూడి గుమ్మరేగుల రూ.29.31, కాకినాడ-1 రూ.29.58లక్షలు, రమణయ్యపేట రూ.29.57, వలసపాకల రూ.29.54, సూర్యారావు పేట రూ.29.41, కొవ్వూరు రూ.29.65, తూరంగి 29.58, తూరంగి-22 రూ.29.58, తూరంగి-4 రూ.29.58లక్షలు, యు.కొత్తపల్లి రూ.29.38, పొన్నాడ రూ.29.38 లక్షలు మంజూరు చేసింది. కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం పోతవరం క్లినిక్‌కు రూ.29.21లక్షలు, రామచంద్రపురం మండలం ఉండూరుకు రూ.29.58, వెలంపాలెం రూ.29.63. కె.గంగవరం-2 రూ.29.22, కె.గంగవరం మండలం దంగేరు క్లినిక్‌కు రూ.29.24, ముమ్మిడివరం మండలం కొత్తలంకకు రూ.28.81లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. ఈ క్లినిక్‌లను ఏడాదిలోగా పూర్తి చేసేలా తాజాగా ప్రభుత్వం టెండర్లు జారీచేసింది. పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో వీటి నిర్మాణం పూర్తికానుండగా, ఈనెల 26లోగా వీటికి టెండర్లు దాఖలు చేయాలని ప్రభుత్వం కాంట్రాక్టర్లను కోరింది.

త్వరలో మరిన్ని..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న వెయ్యికిపైగా ఉన్న హెల్త్ క్లినిక్‌ల్లో 30శాతం పునాదులు, శ్లాబ్ సాయిలో మూడేళ్ల నుంచీ అప్పటి ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో నిలిచిపోయాయి. వీటిని కూడా ఇప్పుడు ప్రభుత్వం పూర్తిచేసేందుకు సన్నాహాలు చేస్తోంది. అటు శాశ్వత భవనాల నిర్మాణంపైనా దృష్టిసారించింది. మరో వారంలో కోనసీమ జిల్లాలో రూ.23 కోట్లతో 56 హెల్త్ క్లినిక్‌లకు శాశ్వత భవనాలు నిర్మించేలా ప్రభుత్వం టెండర్లు పిలవబోతోంది. అలాగే తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లో రూ.12 కోట్లతో మరికొన్ని భవనాల నిర్మాణం చేపట్టనుంది. సగంలో నిలిచిపోయిన క్లినిక్‌లు ఉమ్మడి జిల్లాలో 250కిపైగా పూర్తి చేయడానికి అనుమతులు జారీ చేయనుంది. చాలాభవనాలకు స్థలాలు కూడా లేకపోవడంతో వీటిని కూడా కొన్ని నెలల కిందట ప్రభుత్వం స్థలాలు కేటాయించింది. వీటికి కూడా త్వరలో టెండర్లు పిలవనున్నారు. మరో పక్క ఈ క్లినిక్‌ల్లో ఉండాల్సిన సిబ్బంది కూడా గత ప్రభుత్వంలో చాలాచోట్ల లేరు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రజలకు సరైన వైద్య సదుపాయాలు అందేలా ఏఎన్‌ఎం, ఆశావర్కర్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచి.. వీరంతా ఆయా గ్రామాల్లోని క్లినిక్‌ల్లో ఓపీ సేవలు అందించనున్నారు.

హరహర మహాదేవ!



కాకినాడ సాగరతీరంలోని ఆదికుంభేశ్వరస్వామి ఆలయం వద్ద కోటిశివలింగానికి మహాకుంభాభిషేకం నిర్వహించిన దృశ్యం 6

కార్తీక దీపాలతో దేదీప్యమానంగా..



కార్తీక మాసం చివరిరోజు కావడంతో కాకినాడ రామారావుపేటలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ ఆవరణ మహిళా భక్తులు పెట్టిన దీపాలతో.. ఇలా విభిన్న ఆకారంలో దేదీప్యమానంగా వెలుగొందింది.

ములగపూడిలో మరో భద్రాద్రి!

- అక్కడి కొండపై 14వ శతాబ్దం నాటి కోదండ రామాలయం
- ప్రతిఏటా వైకుంఠ ఏకాదశినాడు గిరి ప్రదక్షిణ 6

సైబర్ నేరగాళ్ల వలలో విశ్రాంత ఎంఈవో

మెయిన్‌లో..

- మూడుదఫాలుగా రూ.34.6 లక్షల పెన్షన్ సొమ్ము పంపేసిన వైనం

మాతృ, శిశు మరణాలపై సమీక్ష

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు జిల్లాలో జరిగిన మాతృ, శిశు మరణాలపై డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ గురువారం సమీక్షించారు. కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశహాల్లో కలెక్టర్ షాన్‌మోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఎంహెచ్‌వో జిల్లాలో మొదటి, రెండు క్వార్టర్లకు సంబంధించి తూరంగి, రాచపల్లి, ఏపీ నగరం, తేటగుంట పీహెచ్‌సీల్లో జరిగిన నాలుగు మాతృ మరణాలకు కారణాలను విశ్లేషించారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు తూరంగి, రౌతులపూడి, శంఖవరం, గెద్దనపల్లి, నేతాజీ పార్క్, యూపీహెచ్‌సీ, రెల్లిపేటలకు సంబంధించి జరిగిన 120 శిశు మరణాలకు గల కారణాలను విశ్లేషించారు. డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. సురక్షిత్ మాతృత్వ అస్వాసన్(సుమన్), ప్రధానమంత్రి సురక్షిత అభియాన్ (పీఎంఎస్‌ఏ), హిస్త్రక్షమీ జిల్లాస్థాయి కమిటీల సమావేశాలు జరిగాయన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మహేశ్వరరావు, గైనిక్ విభాగాధిపతి డాక్టర్ అనురాగమయి, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ విజయశేఖర్, డాక్టర్ పావనికిరణ్మయి, పీడియాట్రిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయభాస్కర్, డాక్టర్ జాన్‌విల్సన్, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాధాకృష్ణ, ఆర్‌బీఎస్‌కే పీవో డాక్టర్ పి.అరుణ, పెద్దాపురం డివిజనల్ ఆఫీసర్ ఎన్.ప్రశాంతి, ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్ జె.ఫ్లోరెన్స్ పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ సజావుగా నిర్వహించాలి

- జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు ఆదేశించారు. ధాన్యం సేకరణలో రైస్‌మిల్లర్ల వద్ద విధులు నిర్వర్తించే కస్టోడియన్ అధికారులతో గురువారం ఆయన కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు 269 రైతు సేవా కేంద్రాలను ప్రారంభించామన్నారు. వీటిని 117 రైస్‌మిల్లులకు అనుసంధానం చేశామన్నారు. ఇప్పటివరకు 25వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. రైతుసేవాకేంద్రాల ద్వారా రైస్‌మిల్లులకు తరలింపు, నమోదు.. ఇలా ప్రతిదశలోనూ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది రైతులకు ధాన్యం సొమ్ము సకాలంలో జమయ్యేలా కృషి చేయాలన్నారు. పౌరసరఫరాల సంస్థ జీఎం దేవులనాయక్, అధికారి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

24న ఢిల్లీ వెళ్తున్న కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ షాన్‌మోహన్ ఈనెల 24న ఢిల్లీ వెళ్తున్నారు. అక్కడ రెండు రోజులు పర్యటిస్తారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్న కేసు విషయమై హాజరవుతారు. ఉప్పాడ తీరప్రాంత రక్షణకు రూ.323 కోట్లతో నిర్మించే రక్షణగోడ నిధుల విడుదలపై కేంద్రంలో ఉన్నతాధికారులను సంప్రదిస్తారు. కాకినాడ, కరప, తాళ్లరేవు మండలాల్లో ఉన్న ఉప్పు భూములు 1,245 ఎకరాలకు జిల్లా అధికారుల కమిటీ ధర నిర్ణయించింది. వాటి ధరను ఫైనలైజ్ చేయడానికి కలెక్టర్ షాన్‌మోహన్ కేంద్రం పరిధిలో ఉన్న డీపీఐఐటీలో ఉన్నతాధికారులతో చర్చిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం వీటిని సాల్ట్ కమిషన్‌నుంచి కొనుగోలు చేసి జిల్లాలో పారిశ్రామిక అవసరాలకు వినియోగించే అవకాశం ఉంది.

కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు సహకరించాలి

- డీఆర్‌వో వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, కొత్త పోలింగ్‌స్టేషన్ల ఏర్పాటు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలకు సహకారం ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు కోరారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న 1640 పోలింగ్ కేంద్రాల్లో 16,43,161 మంది ఓటర్లు నమోదు అయ్యారన్నారు. వారి సౌలభ్యాన్ని పరిగణలోకి తీసుకుని పునర్వ్యవస్థీకరణ, కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు. జిల్లాలో కొత్తగా 183 పోలింగ్ కేంద్రాలు రానున్నాయన్నారు. ఫారం-6, 7, 8 పరిష్కారం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశాలను వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు గదుల సాయిబాబా(టీడీపీ), రావూరి వెంకటేశ్వరరావు (వైసీపీ), ఏవీవీ సత్యనారాయణ(జనసేన), సీహెచ్ రమేష్‌బాబు (బీజేపీ), సబ్బారపు అప్పారావు (బీఎస్పీ), పోలిశెట్టి శ్రీనివాస్(ఐఎన్‌సీ), కరణం ప్రసాదరావు (సీపీఎం), ఎన్నికల విభాగం డీటీ జగన్నాథం పాల్గొన్నారు.

నేడు ఉద్యోగుల పీజీఆర్‌ఎస్

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సూచన మేరకు ప్రతినెలా మూడో శుక్రవారం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పీజీఆర్‌ఎస్ నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. గురువారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో ఉద్యోగుల సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామన్నారు.


ములగపూడి కొండపై పురాతన కోదండ రామాలయం

మరో భద్రాద్రి

కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ములగపూడిలో ఎత్తయిన కొండపై కోదండరాముని పురాతన ఆలయం ఉంది. దీనిని 13-14 శతాబ్దాల మధ్య నిర్మించినట్టు చరిత్ర ద్వారా తెలుస్తోంది. అప్పట్లో ఇక్కడ శ్రీరామనవమిని అంగరంగ వైభవంగా నిర్వహించేవారు. ఈ ఆలయాన్ని చాలా కాలంగా పట్టించుకోలేదు. గ్రామానికి చెందిన కొందరు కమిటీగా ఏర్పడి కొంచెంకొంచెంగా అభివృద్ధి చేస్తున్నారు. ప్రతిఏటా శ్రీరామనవమితో పాటు కార్తీక పౌర్ణమి నాడు తెప్పోత్సవం, వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి రోజున గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్నారు. భక్తులు వేలాదిగా హాజరవుతున్నారు.

- ములగపూడిలో కొండపై 14వ శతాబ్దం నాటి కోదండ రామాలయం
- చరిత్ర ఘనం... ఆదరణ శూన్యం
- గ్రామస్తుల సహకారంతోనే అభివృద్ధి
- ప్రతిఏటా కార్తీక పౌర్ణమినాడు తెప్పోత్సవం, వైకుంఠ ఏకాదశినాడు గిరి ప్రదక్షిణ

(రౌతులపూడి-ఆంధ్రజ్యోతి)

14వ శతాబ్దంలో రాఘవపట్నాన్ని పరిపాలించిన రాఘవరాజు ములగపూడిలో ఈ ఆలయాన్ని నిర్మించినట్టు ఆలయ శాసనాలు తెలుపుతున్నాయి. భద్రాద్రిలో ఉన్నట్టుగానే ఇక్కడ కూడా ఏకశిలపై సీతారాములు ఉండడంతో మరో భద్రాదిగా పేరొందింది. ఆలయం కింద రాతి కట్టడం ఆధారంగా 13-14 శతాబ్దాల మధ్య ఆలయ నిర్మాణం జరిగినట్టు గుర్తించారు. ఉపయోగించిన ఇటుకలు, రాతితో నిర్మించిన ద్వారం, విగ్రహం పురాతన ప్రాశస్త్యాన్ని, గొప్పదనాన్ని చాటి చెప్తున్నాయి. రాతితో చేసిన నీటి తొట్టెలు, హోమ గుండాలు మొదలైన వాటి ఆనవాళ్లు ఇక్కడ ఉన్నాయి. ఆలయ సమీపంలోని వేగులమ్మ వారి పీఠంలో ఉంచిన చిహ్నాలను చోళుల కాలం నాటివిగా చెప్తున్నారు. రాఘవరాజు నిర్మించిన 162 ఎకరాల చెరువు ద్వారా వేలాది వ్యవసాయ భూములకు సాగునీరు అందుతోంది. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఈ దేవాలయాన్ని సందర్శించినట్టు పూర్వీకులు చెప్పేవారు. మహ్మదీయుల దండయాత్రలో ఈ ఆలయం శిథిలమైనట్టు ఓ కథనం ప్రాచుర్యంలో ఉంది.


రాతి కట్టడంతో నిర్మించిన ఆలయ గోపురం లోపలి భాగం


వైకుంఠ ఏకాదశినాడు గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు (పాత చిత్రం)

అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలి

ఆలయ కమిటీ విన్నపం

మేమంతా కష్టపడి మెట్ల మార్గం, రహదారి నిర్మించుకున్నాము. రామయ్యకు పూజలు చేసుకుంటున్నాము. ఆలయం కూలిపోయే స్థితిలో ఉంది. ఆలయ పునర్నిర్మాణానికి గతంలో దేవదాయ శాఖ రూ.75లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులు రావాలంటే సొంతంగా రూ.18లక్షలు కాంట్రిబ్యూషన్ చెల్లించాలి. అంత మొత్తం కట్టే స్థితిలో లేము. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి ఆలయ అభివృద్ధికి సహకరించాలి.


సీతారాముల ఏకశిలా విగ్రహం


16X24 సైజులో లభ్యమైన ఇటుక


కొండపై కనిపిస్తున్న అలనాటి నీటి కుండీ



తేగలు... ఆరోగ్య దీపికలు

- ధర తక్కువ... ఔషధ గుణాలు ఎక్కువ
- ఈ ఏడాది ముందుగానే మార్కెట్‌లోకి

(సామర్లకోట-ఆంధ్రజ్యోతి)

పూర్వీకులకే కాదు ఆధునికులకూ ఆరోగ్య ప్రదాయిని. శీతాకాలంలో ప్రజలు తినే శాఖాహారమిది. తాటి చెట్లు కనుమరుగవుతున్నప్పటికీ డిసెంబరు, జనవరి నెలల్లో విస్తారంగా దొరుకుతుంది. అదే 'తేగ'. తాటి మొలకేనన్న విషయం చాలా మందికి తెలియదు. సంక్రాంతి పండుగ రోజుల్లో గ్రామాల్లో దర్శనమిచ్చే తేగలు ఈ ఏడాది నవంబరు ప్రారంభం నుంచే మార్కెట్లో కనిపిస్తున్నాయి. మారుతున్న వాతావరణ పరిస్థితులతో తాటిపండ్లను ముందుగా నాటడంతో పక్వానికి వచ్చి నవంబరు మొదటి వారానికే తేగలు అందుబాటులోకి వచ్చాయని గ్రామీణ ప్రాంతాల ప్రజలు చెప్తున్నారు.

నగరాలకు ఎగుమతి: ఒకప్పుడు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో తేగలకు చాగల్నాడు ప్రసిద్ధి. దీంతో చాగల్నాడు ప్రాంతాలను ఈ సీజన్లో తేగల్నాడు అని కూడా ముద్దుగా పిలుచుకునేవారు. పెద్దాపురం, రంగంపేట, జగ్గంపేట, రాజానగరం, కిర్లంపూడి, సీతానగరం, కోరుకొండ ప్రాంతాలకు చెందిన వారు తేగలను తీసుకెళ్లి జాతీయ రహదారిపై వెళ్లే లారీల్లోను, విశాఖ, విజయవాడ వైపు వెళ్లే పలు రైళ్లలోను విక్రయిస్తారు. బస్టాండ్లలోనూ విక్రయిస్తూ ఈ సీజన్లో ఎందరో జీవనోపాధి పొందుతారు. నాలుగు తేగలు కేవలం రూ.20 మాత్రమే. తేగల ప్రయోజనాలను గుర్తించిన మన పూర్వీకులు వాటి ఉత్పత్తికి పొలాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసేవారు.

అన్ని వయసుల వారిలో రోగ నిరోధక శక్తిని



పెంచే లక్షణాలు తేగల్లో ఉన్నాయని పోషకాహార నిపుణులు చెప్తున్నారు. తేగలలో బి1, బి2, బి3, సి విటమిన్లు, కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, ఒమెగా, ఫ్యాటీ యాసిడ్లు సమృద్ధిగా ఉంటాయి. తేగలు తిన్న వెంటనే జీర్ణక్రియ మెరుగుపడుతుంది. పేగుల్లో చేరిన మలినాలు తొలగిపోతాయి. ఎముకలు, దంతాలు దృఢపడతాయని గ్రామీణుల విశ్వాసం. చలికాలంలో తేగలు తింటే రక్తహీనత సమస్య పరిష్కారమవుతుంది. తెల్ల రక్త కణాలు వృద్ధి చెందుతాయి. తేగలు తింటే మెదడు కూడా చురుకుగా పనిచేస్తుంది. ఎన్నో ప్రయోజనాలున్న తేగలను పెద్దాపురం, రంగంపేట ప్రాంతాల నుంచి పలువురు తీసుకొచ్చి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. ఇంకెందుకు ఆలస్యం. తక్కువ ధరకు లభించే తేగలను మీరు కూడా ఈ సీజన్లో తినండి మరి.

ఇంటర్నేషనల్ చెస్ పోటీల్లో రాజశేఖర్‌కు స్వర్ణపతకం


దేవరపల్లిలో రాజశేఖర్‌ను సత్కరిస్తున్న జేఏసీ కమిటీ సభ్యులు, తదితరులు

దేవరపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలం గౌరీపట్నంకు చెందిన గెల్లా రాజశేఖర్ ఇంటర్నేషనల్ చెస్ పోటీల్లో పాల్గొని స్వర్ణపతకం సాధించినట్టు గురువారం ఆయన విలేఖరులకు తెలిపారు. ఈ సందరంగా దేవరపల్లిలో మాట్లాడుతూ భూటాన్ దేశం థింపూలో ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు జరిగిన ఎస్‌బీకేఎఫ్ 12వ ఇంటర్నేషనల్ చెస్ పోటీల్లో పాల్గొన్నట్టు చెప్పారు. ఇంకా మరిన్ని అంతర్జాతీయ పతకాలు సాధించటమే తన కోరికన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో జరిగిన చదరంగ పోటీల్లో తాను పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించానని తెలిపారు. కాగా, ఇటీవల గోవాలో జరిగిన చెస్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించానని, నెల్లూరులో జరిగిన పోటీల్లో వివిధ బహుమతులు సాధించినట్టు తెలిపారు. తాను చదరంగం పోటీల్లో ఎంతో శిక్షణ పొంది దీన్ని సాధించినట్టు తెలిపారు. భారత్ తరపున అంతర్జాతీయ స్థాయిలో చెస్ పోటీల్లో పాల్గొని గౌరవం తీసుకురావాలనే తపన తనలో ఉందన్నారు. ప్రస్తుతం తాను రాజమండ్రిలోని గోల్డ్‌జిమ్‌లో ప్రథమ కోచ్‌గా పనిచేస్తున్నానని తెలిపారు. ఈ మేరకు రాజశేఖర్‌ను గురువారం దేవరపల్లిలో జేఏసీ సభ్యులు ఘనంగా సత్క రించారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు దున్న సుమన్ బాబు, పచ్చా రామ్‌గోపాల్, మడతల శంకరం, ముప్పిడి భాస్కర్‌కుమార్, పల్లికొండ సురేశ్‌కుమార్, రాపాక అబ్బులు, మల్లిపూడి శాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదావరి మాతకు పంచహారతి


వృద్ధగౌతమికి కుండలేశ్వరంలో గంగాహారతి ఇస్తున్న దృశ్యం



కాట్రేనికోన, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కుండలేశ్వరం వద్ద గోదావరిమాతకు గురువారం రాత్రి వైభవంగా పంచహారతి నిర్వహించారు. సాయంత్రం శ్రీపార్వతీకుండలేశ్వరస్వామి, శ్రీరుక్మిణీసత్యభామసమేత వేణుగోపాలస్వామి, శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గ, ఆంజనేయ స్వామికి ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరరావు ఆచార్యత్వంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భక్తులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో పంచహారతి వుడకలతో మంగళవాయిద్యాల నడుమ బాణసంచా కాల్పులతో ఊరేగింపుగా వృద్ధగౌతమీ నదీ తీరానికి వెళ్లారు. తర్వాత సంప్రదాయబద్ధంగా పంచహారతి నిర్వహించారు. నక్షత్ర, కుంభ , నాగ, బిల్వ, పంచహారతి నిర్వహించారు. గంగుమళ్ల నిరంజనరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ రాజశేఖర్‌తో పాటు పలువురికి సన్మానాలు చేశారు. కార్యక్రమంలో దాట్ల పవన్, త్సవటపల్లి నాగేంద్ర, త్సవటపల్లి శ్రీను, పీఎస్ఎన్ రాజు, నడింపల్లి సుబ్బరాజు, చెల్లి సురేష్, ఆకాశం శ్రీను, గంగుమళ్ల రవి శంకరకుమార్, గోకరకొండ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నపిల్లల నేరాలపై నియంత్రణకు చర్యలు

- ఐజీ అశోక్‌కుమార్
- ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ


ద్రాక్షారామ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా

ద్రాక్షారామ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ మధ్యకాలంలో చిన్నపిల్లలపై జరిగిన నేరాలకు సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టిపెట్టామని ఐజీ అశోక్‌కుమార్ అన్నారు. గురువారం ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. తర్వాత స్థానిక విలేకరులతో మాట్లాడారు. చిన్నపిల్లలపై జరిగిన నేరాలలో కేసులను త్వరగా విచారణ జరుపుతామన్నారు. చార్జీషీట్ కూడా దాఖలు చేసి ట్రయల్ అనుసరిస్తూ ముద్దాయిలకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ముఖ్యం గా పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల వల్ల కొన్ని సమస్యలు వచ్చాయన్నారు. శక్తి అలాగే గ్రామ మహిళా కార్యదర్శులతో కలసి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో మహిళా టీచర్లకు శిక్షణ ఇవ్వాలని ఎస్పీలకు సూచించడం జరిగిందన్నారు. ఈయనతో ఎస్పీ రాహుల్‌మీనా, డీఎస్పీ ఎస్.రఘువీర్, సీఐ ఎంవీ నారాయణ, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో పూజలు

అంతకుముందు ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని డీఐజీ సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారు, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు.

డీఎస్పీ కార్యాలయం తనిఖీ

రామచంద్రపురం డీఎస్పీ కార్యాలయంలో నమోదైన కేసుల ఫైళ్లను పరిశీలించారు. దీనిలో భాగంగా పెండింగ్ కేసులు స్థితిగతులు, దర్యాప్తు పురోగతి గురించి ఆరా తీశారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థులు


అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన రౌతులపూడి హైస్కూల్ విద్యార్థులు



రంగంపేటలో విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం పార్థసారథి

రౌతులపూడి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రౌతులపూడి జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన పోటీల్లో అథ్లెటిక్స్ విభాగంలో రౌతులపూడి హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న పైల శ్రీనివాస్ షార్ట్‌పుట్, డిస్కస్ త్రో, గాడి రమణమ్మ డిస్కస్‌త్రో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు కోళ్ల రాంబాబు, చైర్మన్ షేక్ సలీం, ఎంఈవోలు సతీష్‌బాబు, కొండబాబు, వ్యాయామోపాధ్యాయులు సుర్ల కృష్ణవేణి, అడిగర్ల మమత, తదితరులు అభినందించారు.

రంగంపేట: రంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారధి గురువారం తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో భాగంగా ఈనెల 18న కాకినాడలో జిల్లా స్థాయి (ఉమ్మడి జిల్లా) జరిగిన 100 మీటర్ల రన్నింగ్, ట్రిపుల్ జంప్‌లో యవ్వన లక్ష్మి, ట్రిపుల్ జంప్‌లో జాహ్నవి, 110 మీటర్ల హర్డిల్స్‌లో జాహ్నవి, సాయివీరలక్ష్మి, పోల్‌వాల్ట్‌లో ప్రసన్న, స్వర్ణ, సత్యనారాయణ ప్రతిభ కనబరిచారని తెలిపారు. వీరు ఈ నెల 23, 24 తేదీల్లో గుంటూరు జిల్లా వినుకొండ జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పీడీలు శైల, వీరబాబు, బూరిబాబును, ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూదనరావును హెచ్‌ఎం అభినందించారు.

కాకినాడలో ఘనంగా మహా కుంభాభిషేకం

- శివనామస్మరణతో మార్మోగిన సాగర తీరం




వివిధ ద్రవ్యాలతో శివలింగానికి అభిషేకాలు జరుపుతున్న దృశ్యం

కాకినాడ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హరిహర మహాదేవ నామస్మరణతో కాకినాడ సాగర తీరం గురువారం మార్మోగింది. ఆది కుంబేశ్వరస్వామి ఆలయం వద్ద 50 వ మహా కుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. భారత యజ్ఞ పీఠం కమిటీ ఆధ్వర్యంలో శివ భక్తుడు నామన రామచంద్రరావు కుటుంబ సభ్యులు ఉదయం గణపతి పూజతో ప్రారంభించి గోపూజ, ఆదికుంబేశ్వరునికి అభిషేకం, అనంతరం కోటి ఎనిమిది లక్షల శివలింగాలకు, పాదరస లింగానికి మహా కుంభాభిషేకం జరిపారు. సాయంత్రం 108 మంది కన్యలతో అభిషేకం చేసిన ద్రవ్యాలను సాగరంలో నిమజ్జం చేశారు. కమిటీ సభ్యుడు తోట పుండరీకాక్షులు (బాబీ) దంపతులు ప్రత్యేక పూజలతో పాటు స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరిపి మహిళలకు పసుపుతాళ్లు, పురుషులకు రుద్రాక్షలు అందజేశారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) విచ్చేసి ప్రత్యేక పూజలు జరిపారు. విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ (రామ సేన) అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. సుమారు 10 వేల మంది భక్తులు తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు బీజేపీ నేతలు యెనిమిరెడ్డి మాలకొండయ్య, సాలగ్రామ లక్ష్మీప్రసన్న, తోట పృథ్వీరాజ్, గంధం పల్లవరాజు, కమిటీ సభ్యులు బోగిరెడ్డి తాతారావు, సలాది శ్రీనివాసరావు, ఆరుముగం నటరాజ్, గంగిరెడ్డి అరుణ, నామన ప్రసన్న, బూర్ల మాత, తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సూచన మేరకు కాకినాడ కుంభాభిషేకం రేవు పాటదారులు, బోట్ల యజమానులు, వర్తక సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో పది వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్, నాయకులు ఎరిపిల్లి రాము, పి.సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.



దర్శనం కోసం వేచియున్న భక్తులు

గోదావరి యానాం.. అత్యద్భుతం

సూర్యాస్తమయం.. అటుపై గోదావరి తీరం.. ఎటుచూసినా పసుపుమయం.. కాసేపటికి వచ్చెను ఎరుపువర్ణం.. యానాం రాజీవ్ గాంధీ బీచ్‌లో గౌతమీ గోదావరి వద్ద గురువారం కనిపించిన ఈ అద్భుతమైన దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్ మనిపించిందిలా..

– యానాం (ఆంధ్రజ్యోతి)



ముమ్మాటికీ బూటకపు ఎన్‌కౌంటర్

-అంజమ్మ, అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు



రంపచోడవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మంగళవారం, బుధవారాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో మృతిచెందిన టెక్ శంకర్ సహా నలుగురు మావోయిస్టుల మృతదేహాలకు గురువారం అధికారులు పోస్టుమార్టం నిర్వహించారు. కాగా, మారేడుమిల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్లు ముమ్మాటికీ బూటకమేనని, మావోయిస్టులను పోలీసులు పట్టుకొని తీసుకువచ్చి మారేడుమిల్లి అటవీప్రాంతంలో కాల్చేశారని, ఇది ముమ్మాటికీ రాజ్య హింసేనని, పోలీసుల అదుపులో ఉన్న మావోయిస్టులను తక్షణం కోర్టులో హాజరుపర్చాలని అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అంజమ్మ కోరారు.

బాల్యం నుంచే ఉద్యమం బాట

-మధుసూదన్‌రావు, టెక్ శంకర్ సోదరుడు



మూడో తరగతి చదువుకునేరోజుల్లోనే తన సోదరుడు టెక్ శంకర్ ఉద్యమబాట పట్టాడు. దొరికిపోయి చనిపోయాడని కొందరు, ఎదురు కాల్పుల్లో చనిపోయాడని కొందరు చెబుతున్నారు. బ్రతికి ఉంటే సంతోషించేవారం. ఇటీవల అమ్మ చనిపోయింది. ఇప్పుడు అన్నయ్య(టెక్ శంకర్) ప్రాణాలతో ఉంటే సంతోషించేవారం. ఎన్‌కౌంటర్‌లో అన్నయ్య చనిపోయాడని తమకు పోలీసులు సమాచారం ఇచ్చేవరకు తెలియదు. ఎన్‌కౌంటర్‌పై అనుమానాలున్నాయి. ఏం జరిగిందో పోలీసులకే తెలియాలి. వారి రాజ్యం వారి ఇష్టం. మృతదేహాన్ని ఇస్తే తీసుకెళ్లిపోతాం.

సత్యదేవుడికి రూ.8.40 కోట్ల ఆదాయం

- కార్తీకమాసంలో వ్రతాల సంఖ్య 1,34,476
- స్వామివారిని దర్శించిన 13 లక్షల మంది భక్తులు
- వెల్లడించిన అధికారులు

అన్నవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో కార్తీకమాస వ్రతాల సంఖ్య లెక్క తేలింది. గురువారంతో కార్తీకమాసం ముగియడంతో వివరాలను అధికారులు వెల్లడించారు. వ్రతాల ద్వారా రూ.8.40 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది వ్రతాల సంఖ్య తగ్గిన విషయం విదితమే. గతేడాది కార్తీకమాసంలో 1,45,732 వ్రతాలు జరగగా ఈఏడాది 11256 లోటుతో 1,34,476తో ముగిసింది. అన్నవరం దేవస్థానంలో రూ.300, 1000, 1500, 2000 ధరల్లో వ్రతం టిక్కెట్లు అందుబాటులో ఉండగా వీటిలో ఆన్‌లైన్ టిక్కట్లతో కలిపి సామాన్యులు ఆచరించుకున్న రూ.300 ధర వ్రతాలు 96484 జరిగాయి. రూ.100 ధర వ్రతాలు 16099, రూ.1500 ధర వ్రతాలు 9511, రూ.2000 ధర వ్రతాలు 12382 జరిగినట్టు అధికారులు తెలిపారు. ఈ ఏడాది కార్తీక మాసంలో కేవలం వ్రతాల ద్వారా స్వామివారి ఖజానాకు రూ.8,40,74,700 ఆదాయం లభించింది. మిగిలిన విభాగాల నుంచి మరో రూ.11.50 కోట్లు కలిపితే కార్తీకమాస ఆదాయం సుమారు రూ.20 కోట్లు రావొచ్చని అంచనా వేస్తున్నారు. రెండోపర్యాయం హుండీల లెక్కింపు పూర్తయిన తరువాత అధికారికంగా కార్తీకమాస ఆదాయం వెల్లడిస్తామని ఈవో వీర్ల సుబ్బారావు తెలిపారు. గతేడాది కంటే వ్రతాల సంఖ్యతో పాటుగా ఆదాయం కూడా సుమారు రూ.50 లక్షలనుంచి రూ.కోటి వరకు తగ్గవచ్చని అధికారులు భావిస్తున్నారు. కార్తీకమాసం అంతా కలిపి సుమారు 13 లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. దేవదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో దేవస్థానం సిబ్బంది సమష్టి కృషితో భక్తులకు ఎక్కడా అసౌకర్యం, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. అన్నవరం దేవస్థానం ఛైర్మన్ ఐవీ రోహిత్ పర్వదినాల్లో పశ్చిమరాజగోపురం వద్దనే ఉండి దళారుల ప్రవేశాన్ని నిరోధించి కేవలం వృద్ధులు, దివ్యాంగులకు మాత్రమే లిఫ్ట్‌సౌకర్యం పూర్తిస్థాయిలో అందించగలగడంతో పలువురి ప్రశంసలు పొందారు. కార్తీక పౌర్ణమి, స్వామివారి తెప్పోత్సవం, గిరిప్రదక్షిణ, జ్వాలాతోరణం, పంపా హారతులు వంటి ముఖ్యమైన కార్యక్రమాలను నిర్దేశించిన సమయానికి నిర్వహించడంలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. పోలీసులు కూడా ఎంతో కష్టించి భక్తులకు సేవలందించారు.

భగవద్గీత సారాంశం సకల మానవాళికీ దిక్సూచి

అన్నవరం దేవస్థానంలో 12 రోజులపాటు గీతాజయంతి వేడుకలు : ఈవో సుబ్బారావు

అన్నవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహాభారతంలో శ్రీకృష్ణుడు, అర్జునుడికి ఉపదేశించిన భగవద్గీత సారాంశం సకల మానవాళికీ దిక్సూచీ అని అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం దేవస్థానంలో శ్రీ మద్భగవద్గీత జయంతి వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. డిసెంబరు 1 వరకు రోజుకొక పాఠశాల విద్యార్థులకు భగవద్గీత పారాయణ,ధ్యానం, సజ్జనసాంగత్యం నిర్వహిస్తామని.. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని ఈవో తెలిపారు. గీతాజయంతి రోజున అన్నమయ్య 12వ తరం వారసులు తిరుమల శ్రీవారి ఆలయ సంకీర్తన కైంకర్యవర్యులు తాళ్లపాక స్వామీజీ విచ్చేస్తారని చెప్పారు. ఈ వేడుకలను గత 12ఏళ్లగా ఏడాదికి ఒకరోజు పెంచుకుంటూ ప్రతీ ఆలయంలో నిర్వహిస్తున్నట్లు గీతాజయంతి ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. గీతాసారాంశాన్ని చిన్నారుల్లోకి తీసుకెళ్లి సమాజానికి మరింత చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు.



భగవద్గీతపై ప్రసంగిస్తున్న ఈవో సుబ్బారావు, హాజరైన విద్యార్థులు



వనదుర్గ ఆలయంలో ప్రత్యంగిర హోమం

అన్నవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్ర రక్షకి వనదుర్గ ఆలయంలో గురువారం అమావాస్య పర్వదినం పురస్కరించుకుని ప్రత్యంగిర హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం ప్రత్యంగిర దేవతను ఆవాహన గావించారు. ఈ సందర్భంగా జపములు, పారాయణలు, హోమములు నిర్వహించారు. 11గంటలకు పవిత్ర హోమగుండం లో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గా వించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

పులుల గణనపై శిక్షణ

చింతూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత పులుల గణనపై శిక్షణా కార్యక్రమం గురువారం చింతూరు అటవీ కార్యాలయ ప్రాంగణంలో జరిగింది. శిక్షణ ఇచ్చేందుకు డెహ్రాడూన్ నుంచి వరల్డ్ వైల్డ్ ఫండ్ ఫర్ నేచర్ రీసెర్చ్ బయాలిజిస్ట్ సాయికృష్ణ బృందం వచ్చింది. ఈ మేరకు జంతు జాడను కనుగొనే మెళకవలను వివరించారు. చింతూరు డీఎఫ్‌వో రవీంద్రనాద్‌రెడ్డి మాట్లాడుతూ సిబ్బంది శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే జనవరి నుంచి ఫిబ్రవరి వరకు క్షేత్ర స్థాయిలో 3సార్లు జంతు గణన చేపట్టాల్సి ఉంటుందన్నారు. సబ్ డీఎఫ్‌వోలు రాఘవరావు, శివకుమార్, రేంజీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న చింతూరు డీఎఫ్‌వో రవీంద్రనాథ్ రెడ్డి, పాల్గొన్న చింతూరు డివిజనల్ స్థాయి సిబ్బంది



పెళ్లి పనులకు ఊరెళ్తే ఇల్లు గుల్ల



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

పెద్దాపురంలో చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

నిందితుడిపై పలు పోలీస్ స్టేషన్‌లలో కేసులు

పెద్దాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కూతురికి పెళ్లి కుదరడంతో పనుల నిమిత్తం ఊరు వెళ్తే ఇంట్లోకి దొంగ చొరబడి నగదు, బంగారం దోచుకెళ్లాడు. ఈనెల 10న కాకినాడ జిల్లా పెద్దాపురం టెలికం కాలనీలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను గురువారం పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరి రాజు విలేకర్లకు వెల్లడించారు. నిందితుడిని పట్టుకున్నట్టు చెప్పారు. వివరాల ప్రకారం.. పెద్దాపురం టెలికం కాలనీకి చెందిన పెంకే సింహాచలం ఆర్బీ పట్నం ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అతడి కుమార్తెకు వివాహం కుదరడంతో రూ.5 లక్షల నగదు, అరకాసు బంగారం బెడ్‌రూమ్ బీరువా లాకర్‌లో భద్రపరిచాడు. పెళ్లి పనుల నిమిత్తం కుటుంబ సభ్యులంతా కాకినాడ వెళ్లారు. దీంతో అనూరు గ్రామానికి చెందిన యర్రంశెట్టి చరణ్ విఘ్నేష్ ఇంటి తలుపులు బద్దలు కొట్టి లాకర్‌ను తెరిచి రూ.5 లక్షల నగదు, అరకాసు బంగారు వస్తువును దోచుకెళ్లాడు. రాత్రి 12 దాటిన తర్వాత ఇంటికి చేరుకున్న యజమాని ఇంటి తలుపులు తెరిచి ఉండడం గమనించాడు. బెడ్‌రూమ్‌లోని బీరువాలో నగదు, బంగారు వస్తువు మాయం కావడం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్‌ఐ వి.మౌనిక కేసు నమోదు చేయడంతో సీఐ విజయశంకర్ దర్యాప్తు చేశారు. బుధవారం రాత్రి పెద్దాపురం నుంచి సామర్లకోట వెళ్లే రహదారిలో అయోధ్యాలయం గ్రాండ్ లేఅవుట్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న నిందితుడిని సీఐ విజయశంకర్ అరెస్టు చేశారు. నిందితుడి దగ్గర నుంచి బంగారం, రూ.3.60 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, హోండా యాక్టీవా మోటారు సైకిల్, దొంగతనానికి ఉపయోగించే ఇనుప రాడ్డును స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితుడిపై గతంలో చైతన్యపురం, మలక్‌పేట, అంబర్ పేట, సరూర్ నగర్, రాజమండ్రి వనస్థలిపురం, గండేపల్లి, ప్రకాష్‌నగర్, సర్పవరం, హయాత్ నగరం పోలీస్ స్టేషన్‌లలో పలు దొంగతనం కేసులు నమోదైనట్టు డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందిని డిఎస్పీ అభినందించారు.

ఫేక్ కాల్‌తో సైబర్ మోసం

- పోలీసులమంటూ ఓ వ్యక్తికి సైబర్ నేరస్తుల ఫోన్
- దొంగ బంగారం కొన్నారని కేసు పెడతామని బెదిరింపులు
- భయపడి రూ.30వేలు ఫోన్‌పే చేసిన బలభద్రపురం వాసి

బిక్కవోలు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా బలభద్రపురానికి చెందిన అమలాపురపు శ్రీనివాస్ ఫేక్ ఫోన్ కాల్‌తో సైబర్‌నేరస్తుల బారిన పడి రూ.30 వేలు పోగొట్టుకున్నాడు. దీనికి సంబంధించి బిక్కవోలు ఎస్‌ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపిన వివరాలప్రకారం.. గురువారం ఉదయం పది గంటలకు 9493191296 నెంబరు నుంచి శ్రీనివాస్‌కు ఫోన్ వచ్చింది. ఫోన్ చేసిన వ్యక్తి మేం కుప్పం పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్నాం. మీరు దొంగ బంగారం కొనుగోలు చేశారని, వెంటనే పోలీస్‌స్టేషన్‌కు రావాలని లేకపోతే కేసు ఫైల్ చేస్తామని హెచ్చరించాడు. ఇలా పలుమార్లు ఫోన్ చేసి పోలీస్ స్టేషన్‌కు రావాలని లేకపోతే రూ.50వేలు ఫోన్ పే చేయాలని ఒత్తిడి చేశాడు. దీంతో శ్రీనివాస్ సాయంత్రం రూ.30వేలు ఫోన్ పేచేశాడు. ఇది నకిలీకాల్ అని అతడి కుమారుడు గుర్తించాడు. తర్వాత పోలీసులను సంప్రదించారు. ఇది సైబర్ మోసమని తెలపడంతో శ్రీనివాస్ సైబర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేశాడు. ఆ తరువాత 1930 నెంబర్ నుంచి కాల్ వచ్చి బిక్కవోలు పోలీస్‌స్టేషన్‌లో రిపోర్టుఇవ్వాలని సూచించడంతో వారు తమకు ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ వివరించారు.

వరికోత యంత్ర పరికరాలు, 120 లీటర్ల డీజిల్ చోరీ

బిక్కవోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరికోత యంత్రానికి సంబంధించిన మోటార్, డోర్లు చోరీకి గురయ్యాయని యంత్రం యజమాని వి.పవన్ గురువారం బిక్కవోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బిక్కవోలు ఎస్‌ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం సారభావరం గ్రామానికి చెందిన వి.పవన్‌కు హార్వెస్టర్ వరికోత యంత్రం ఉంది. యంత్రంతో వరికోత పనులకు వెళ్తుంటాడు. ఇందులో భాగంగా తూర్పు గోదావరి జిల్లా బలభద్రపురం గ్రామంలోని చొల్లంగి పడ్డయ్య పొలంలోని వరిని బుధవారం కొంతమేర కోతకోసి మిగిలిన వరిని మరునాడు కోద్దామని యంత్రాన్ని పొలంలోను ఉంచేశాడు. గురువారం ఉదయం వెళ్లేసరికి హార్వెస్టర్ యంత్రానికి సంబంధించిన రెండు సైడు డోర్లు, ఆగర్ మోటార్, త్రిషర్‌డోర్, 120 లీటర్ల డీజిల్ ఆయిల్ చోరీ అయినట్టు పవన్ గుర్తించాడు. వాటి విలువ రూ.60వేలు ఉంటుందని తెలిపి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

ఆయిల్ ట్యాంకర్ సీజ్

ముగ్గురిపై కేసు

ఐ.పోలవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత ప్రాంతం యానాం నుంచి ఎనిమిది వేల లీటర్ల డీజిల్ ఆయిల్‌తో పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటకు వెళ్తున్న ఒక ట్యాంకర్‌ను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎదుర్లంక వద్ద ఐ.పోలవరం పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. ట్యాంకర్‌ను సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఎంవీవీ రవీంద్రబాబు తెలిపారు.



పోలీసులు సీజ్ చేసిన ఆయిల్ ట్యాంకర్

హుండీ లెక్కింపులో సేవకుడిగా వచ్చి.. రూ.60వేలు దోచేసి...

నిందితుడి అరెస్ట్

14 రోజుల రిమాండ్ విధింపు

ఆత్రేయపురం, నవంబరు 20 (ఆంధ్ర జ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన హుండీ లెక్కింపులో నగదును తస్కరించిన వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ ఎస్.రాము తెలిపారు. వివరాల ప్రకారం.. రామచంద్రాపురం మండలం వేగయమ్మపేటకు చెందిన వాసంశెట్టి శ్రీనివాసరావు బుధవారం వెంకన్న ఆలయంలో హుండీ లెక్కింపులో సేవకుడిగా పాల్గొన్నాడు. సిబ్బంది కళ్లుకప్పి రూ.60వేలు నగదు దొంగిలించగా సెక్యూరిటీ సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆలయ ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు తెలిపారు.

ఆరోగ్య ఉప కేంద్రం ఖాళీ చేయాలి

వైద్యాధికారికి డిప్యూటీ డీఎంహెచ్‌వో నోటీసు

చింతూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ఉప కేంద్రం ఖాళీ చేయాలని వైద్యుడికి డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.పుల్లయ్య గురువారం నోటీసు ఇచ్చారు. అల్లూరి జిల్లా కూనవరం మండలం కూటూరు ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి డా.శ్రీనివాసమూర్తి కొద్దికాలంగా తులసిపాకల ఆరోగ్యకేంద్ర పరిధిలోని చింతూరు ఆరోగ్య ఉపకేంద్రంలో నివాసముంటున్నారు. దీంతో ఉప కేంద్రంలో నిర్వహించాల్సిన ఏఎన్‌సీ క్లినిక్, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, రివ్యూ సమావేశాలతో సహా తదితర కార్యక్రమాలను నిర్వహణకు అడ్డంకిగా మారింది. ఈ నేపథ్యంలో ఆరోగ్య కార్యకర్తలు ఫిర్యాదు చేయడంతో విధిగా ఆరోగ్య ఉప కేంద్రం ఖాళీ చేయాల్సిందిగా డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆదేశించారు. అందుకు కేవలం 3 రోజులు మాత్రమే గడువు ఇచ్చారు. లేకపోతే స్థానిక సర్పంచ్, గ్రామ పంచాయితీ కార్యదర్శి, మండల రెవెన్యూ అధికారి, ఎస్‌ఐ సమక్షంలో పంచనామా నిర్వహించి ఆరోగ్య ఉపకేంద్రం స్వాధీన పర్చుకోవాల్సి వస్తుందని నోటీసులో హెచ్చరించారు.

సామర్లకోటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

సామర్లకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట గాంధీనగర్ నూకాలమ్మ గుడి ప్రాంతంలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపం కారణంగా గురువారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌కు గురై పెద్దఎత్తున మంటలు చుట్టిముట్టాయి. దీంతో ఆ ప్రాంతానికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారం అలుముకుంది. తరచూ ఇక్కడి ట్రాన్స్‌ఫార్మర్ సాంకేతిక లోపాలకు గురవుతుందని స్థానికులు చేసిన ఫిర్యాదుల మేరకు బుధవారమే ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసి గురువారం విద్యుత్ సరఫరా తిరిగి పునరుద్ధరించిన గంట సమయానికే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి మొత్తం బుగ్గి అయ్యింది. స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు విద్యుత్ సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకునివిద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.



ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎగిసిపడుతున్న మంటలు

కాకినాడ జిల్లాలో సారాపై ఉక్కుపాదం

1,306 కేసుల నమోదు... 965 మంది అరెస్ట్

136 గ్రామాలు సారా రహితంగా ప్రకటన

ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి ఎం.కృష్ణకుమారి

కాకినాడ క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాను సారా రహితంగా తీర్చిదిద్దేందుకు సారాపై ఉక్కుపాదం మోపినట్టు ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి ఎం.కృష్ణకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సారా నిర్మూలన లక్ష్యంగా నవోదయం 2.0 కార్యక్రమాన్ని కలెక్టర్ షాన్‌మోహన్ ఈ ఏడాది మార్చి 7న ప్రారంభించారన్నారు. అప్పటి నుంచీ జిల్లావ్యాప్తంగా ఉన్న 7ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని 21 మండలాల్లో గల 136 గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, సిబ్బంది నిర్విరామ కృషితో సారాపై ఉక్కుపాదం మోపారన్నారు. మార్చి నుంచి ఈనెల 10వరకు 1,306 కేసులు నమోదు చేసి 965మందిని అరెస్టు చేసి 18,490 కిలోల నల్ల బెల్లం, 9,220 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. సారా తయారీకి వినియోగించే 5,49,650 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 53 వాహనాలను సీజ్ చేశామన్నారు. 1,375 మందిని బైండోవర్ చేసి వారిలో నలుగురిపై పీడీ యాక్ట్ తెరిచామని చెప్పారు. బ్రీచ్ అయిన వారి నుంచి రూ.14,48,500 వసూలు చేసి ప్రభుత్వ ఖాతాలో జమ చేశామన్నారు. పోలీసు, రెవెన్యూ, అటవీ శాఖల అధికారుల సహకారంతో నవోదయం 2.0ను విజయవంతం చేయగలిగామన్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం 136 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా ప్రకటించడం ఆనందదాయకమని ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి ఎం.కృష్ణకుమారి చెప్పారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

వైభవంగా సత్య దత్త వ్రతాలు

పిఠాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో సత్య దత్త వ్రతాలు గురువారం వైభవంగా జరిగాయి. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు విశేష పూజలు, అభిషేకాలు, గోపూజ నిర్వహించారు. అనంతరం స్వాములను పుష్పాలు, బిల్వాలతో అలంకరించారు. ఈవో ఆర్.సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.



కాకినాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విజేతకు మెమెంటో, సర్టిఫికెట్ అందజేస్తున్న సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ హరీష్. చిత్రంలో కాకినాడ డీఎల్పీవో అన్నామణి



పెద్దాపురంలో విజేతలకు సర్టిఫికెట్ ఇస్తున్న డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు



కాకినాడ రూరల్ రమణయ్యపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో రైతులకు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

గ్రంథాలయాలు విజ్ఞాన గనులు

వారోత్సవాల ముగింపు సభలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు

పలు పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం

కాకినాడ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని కాకినాడ డివిజనల్ పంచాయతీ అధికారి టి.అన్నామణి కోరారు. కాకినాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన అన్నామణి మాట్లాడుతూ గ్రంథాలయాలువిజ్ఞాన భాండాగారాలన్నారు. మరో ముఖ్య అతిథి, సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ తరఫున గ్రంథాలయాల్లో అనేక సదుపాయాలు కల్పించామన్నారు. వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో 600 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. 54 మంది విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లను ముఖ్య అతిథులు అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు బి.సూర్యనారాయణ, చిత్రకారుడు ఎం.చిన్నబాబు, డీఆర్డీఏ శిక్షకురాలు ఎం. సత్యబాల, రామశేషాద్రి, ఉప గ్రంథాలయాధికారి కె.కిషోర్, సీనియర్ అసిస్టెంట్ ఎం.శ్రావ్య, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) కోరారు. ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో జరిగిన ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల, పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జోశ్యుల కృష్ణబాబు, కూటమి నాయకుడు పోలమరశెట్టి సత్తిబాబు, లైబ్రేరియన్ పాలంకి నాగరాజు, సిబ్బంది సింగం బుల్లియ్య పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు భవిష్యత్తు తరాలకు విజ్ఞాన గనులుగా దోహదపడతాయని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభను పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ బందిల రత్నమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథిగా హాజరైన బాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు శ్రీవిద్య, అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు శ్రీనివాసు, అందుగుల మణికుమారిచక్రవర్తి, సరోజావాసు, మంచెం సాయిబాబు, జానకి రామారావు, నూతలపాటి అప్పలకొండ, ఉపాధ్యాయులు గురుప్రకాష్, బాలమురళీకృష్ణ, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పిఠాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు రాజు, డీవైఈవో ప్రభాకరశర్మ పుస్తక పఠనం ప్రాధాన్యాన్ని వివరించారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి రేపాక వెంకటరాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సూర్యరాయ విద్యానంద గ్రంథాలయ కార్యదర్శి కొండేపూడి శంకరరావు, విశ్రాంత ఉప గ్రంథాలయాధికారి సలాది సాయి సత్యనారాయణ, భారత్ హైస్కూల్ ప్రిన్సిపాల్ గట్టి శ్రీకృష్ణదేవరాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): కోరంగి గ్రంథాలయంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ఎంపీడీవో లక్ష్మణరావు బహుమతులు అందించారు. మాజీ జడ్పీటీసీ పొన్నమండ రామలక్ష్మి, కార్యదర్శి వీజేవీ రమణ, సొసైటీ అధ్యక్షుడు కొప్పిశెట్టి బాబీ, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, చంటి, గాలి సత్యనారాయణ, సిద్దన బాబి, రాపర్తి వెంకటేశ్వరరావు, లైబ్రేరియన్ కనికెళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ, కొత్తపల్లి గ్రంథాలయాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఎంఈవోలు బుర్రా వేణుగోపాల్, పైడిరాజు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. మొబైల్ వాడకం తగ్గించి పుస్తకాలవైపు దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. లైబ్రేరియన్లు టి.జయకృష్ణ, టి.నళినీప్రియ, హెచ్‌ఎంలు శాస్త్రి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



అఖండ కోటి దీపారాధన

సామర్లకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వర స్వామి ఆలయ ఆవరణలో కార్తీక దీపారాధన సేవా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో గురువారం రాత్రి అఖండ కోటి దీపారాధన నిర్వహించారు. తొలుత గణపతి పూజ చేసి పండితులు గంట మోగించగా అప్పటికే వందలాది భక్తులు శివనామస్మరణతో దీపాలను ఒకేసారి వెలిగించడంతో ఆలయ ప్రాంగణం దేదీప్యమానమైంది. కార్తీక మాసం ముగింపు సందర్భంగా ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు నంది మండపం వద్ద స్వామి, అమ్మవార్లకు శాంతి కల్యాణం జరిపించారు. ధర్మకర్తల మండలి అధ్యక్షుడు కంటే జగదీష్ మోహన్ (బాబు), సభ్యులు పాల్గొన్నారు.



దేదీప్యమానం...

కాకినాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రామారావుపేటలో గల అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీనారాయణస్వామి పూజ అనంతరం దీపోత్సవం జరిపారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులు వెలిగించిన దీపాలతో ఆలయ ఆవరణ కాంతులీనింది.



ఘనంగా ద్వాదశ లింగ దీపోత్సవం

కాకినాడ సిటీ/ కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు సందర్భంగా నగరంలోని బాలాత్రిపురసుందరి అమ్మవారి ఆలయంలో గురువారం రాత్రి ద్వాదశ లింగ దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున దీపాలను వెలిగించి శివుడిని భక్తి శ్రద్ధలతో పూజించారు. ఈవో వుండవల్లి వీర్రాజుచౌదరి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సహస్రదీపాలంకరణ సేవ

పిఠాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో గురువారం రాత్రి సహస్ర దీపాలంకరణ సేవ జరిగింది. శివలింగాకారంలో దీపాలను వెలిగించారు. రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులతో ప్రదక్షిణ చేశారు. అర్చకుడు పి.విజయజనార్దనాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరగ్గా ఈవో నున్న శ్రీరాములు, సేవా సమితి అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్, అప్పలరాజు, పైండా రమా భాస్కరరావు, వేద పండితులు పాల్గొన్నారు.

దుస్తులు, కళ్లజోళ్లు పంపిణీ

కాకినాడ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ లయన్స్ క్లబ్ హాలులో బాదం బాలకృష్ణ క్లాత్, ఐ గ్లాస్ ప్రాజెక్టు ద్వారా గురువారం 75 మంది పేదలకు దుస్తులు, కళ్లజోళ్లు సమకూర్చారు. ముఖ్య అతిథిగా హాజరైన లయన్స్ క్లబ్ కోశాధికారి వి.వెంకట నూకాజీ వీటిని అందజేశారు. జగన్నాథరావు, రామసుబ్రహ్మణ్యం, కృష్ణారావు పాల్గొన్నారు.



పిఠాపురంలో విజేతకు సర్టిఫికెట్ అందజేస్తున్న మున్సిపల్ కమిషనరు రాజు



తాళ్లరేవు మండలం కోరింగలో....



ఉప్పాడ కొత్తపల్లిలో....

'స్వచ్ఛ కాకినాడలో ప్రజలు భాగస్వాములు కావాలి'

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడను స్వచ్ఛ నగరంగా అభివృద్ధి చేయడంలో ప్రజలు భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనరు సుధాకర్ కేటీ సుధాకర్ కోరారు. గురువారం ఆయన పలు వార్డుల్లో పారిశుధ్య నిర్వహణను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. పదో సర్కిల్ మస్టర్ కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. విధులకు హాజరు కాని పారిశుధ్య కార్మికులకు వెంటనే మెమో జారీ చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మార్గదర్శకాలతోపాటు కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాల మేరకు నగరంలో పారిశుధ్యాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని మరిన్ని మార్పులు తీసుకొస్తున్నామన్నారు. నగరాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యమన్నారు. తడి, పొడి చెత్తలను ఇంటి వద్దే వేరుచేసి ఇవ్వడంపై ప్రజల్లో అవగాహన పెంచాలని సిబ్బందికి సూచించారు. చెత్తను వేరు చేయకుండా ఇస్తే కార్మికులు స్వీకరించరాదని స్పష్టం చేశారు. కొంతమంది డ్రైనేజీల్లో చెత్త వేయడం వల్ల అడ్డంకులు ఏర్పడి అదనపు సిబ్బందిని నియమించాల్సి వస్తోందని, ఇది రోడ్ల పరిశుభ్రత పనుల్లో ఆలస్యానికి దారితీస్తోందన్నారు. అనంతరం డెయిరీ ఫారం సెంటర్లో అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన కమిషనర్ మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారో లేదో చూశారు. ప్రజలతో మాట్లాడి రుచి, నాణ్యత, సేవలపై అభిప్రాయాలు సేకరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, సుదర్శన్, రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

'బీపీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి'

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్)ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనరు కేటీ సుధాకర్ కోరారు. నగర పరిధిలోని అనధికార నిర్మాణాలను ఈ పథకం కిందకు తీసుకొచ్చి వచ్చే ఏడాది మార్చి 12 నాటికి వంద శాతం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. డీసీపీ కృష్ణారావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో సుధాకర్ మాట్లాడుతూ దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకత, వేగవంతమైన సేవలు, బాధ్యతాయుత వైఖరి పాటించాలని ఆదేశించారు. స్కీమ్ వివరాలు, అవసరమైన పత్రాలు, ఫీజు వంటి అంశాలు ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా వివరించాలన్నారు. ప్రతి వార్డు స్థాయిలో ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటుచేసి దరఖాస్తులను సమయానికి స్వీకరించి త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఏసీపీ, టీపీఎస్, టీపీబీవోలు, డబ్ల్యూపీఆర్ఎస్‌లు, కుడా పీవో, ఏపీవోలు, ఎల్‌టీపీలు, క్రెడాయ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తాటిపర్తి, మల్లవరం గ్రామాల్లోని స్వయంభూ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో జరిగే షష్ఠి ఉత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. ఉత్సవాల ఏర్పాట్లపై గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయంలో గురువారం మండల స్థాయి అధికారులు, ఆలయ కమిటీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బారికేడ్లు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తాటిపర్తి, మల్లవరంల్లో వాహనాలను నిలిపేందుకు మూడు చొప్పున పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేస్తున్నట్టు కమిటీల ప్రతినిధులు తెలిపారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గొల్లప్రోలు తహసీల్దారు రామకుమార్, ఎంపీడీవో సెలట్ రాజు, ఎస్ఐ రామకృష్ణ, ఆలయ కమిటీల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'కన్నబాబూ... తప్పుడు ఆరోపణలు తగవు'

సామర్లకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయ మంత్రిగా వ్యవసాయాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిన నువ్వు నేడు కూటమి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేయడం తగునా అని కురసాల కన్నబాబును టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తీవ్రంగా విమర్శించారు. అచ్చంపేటలోని తన స్వగృహంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో చినరాజప్ప మాట్లాడారు. వ్యవసాయ వైఫల్యాల మంత్రిగా పేర్గాంచిన కన్నబాబు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని విమర్శించే నైతిక అర్హత ఎప్పుడో కోల్పోయారన్నారు. వ్యవసాయ మంత్రిగా ఎన్నడూ రైతుల కోసం పాటుపడని కన్నబాబు నేడు వ్యవసాయంపై కొత్తకొత్త మాటలు వల్లించడం తగదన్నారు. కూటమి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేయడం మాని బుద్ధిగా ఇంట్లో కూర్చోవాలని హితవు పలికారు.

23న స్కాలర్‌షిప్ టెస్ట్

కాకినాడ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సినర్జీ ఇంటర్నేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో కాకినాడ సురేష్‌నగర్‌లోని శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో ఈ నెల 23న స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్టు డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో 11వ తరగతి ప్రవేశానికి నిర్వహించే ఈ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా 100 శాతం వరకు ఫీజు రాయితీ పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9032616333 నెంబరును సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

పిఠాపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ స్టేషన్ ఆవరణలో గల ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో గురువారం కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రిడ్రెసల్ ఫోరం నిర్వహించారు. న్యాయ స్థానం చైర్మన్ సత్యనారాయణ, ఫైనాన్స్, ఇండిపెండెంట్ మెంబర్లు ఎస్.సుబ్బారావు, ఎన్.మురళీకృష్ణ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు, సలహాలు, సూచనలు స్వీకరించారు. మీటర్లల్లో లోపాలు, రీడింగ్ పొరపాట్లు, మీటర్లు కాలిపోవడం, అదనపు లోడు తదితర అంశాలపై ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. పెద్దాపురం ఈఈ ప్రభాకర్, డీఈఈ శ్రీనివాస్, ఏఈఈలు పాల్గొన్నారు.

ఈవీఎంల గోదాము తనిఖీ

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాములను కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎం, వీవీ ప్యాట్ల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతినెలా ఈవీ ఎం, వీవీ ప్యాట్ గోదాములను క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదిక పంపిస్తున్నామన్నారు. ఈవీఎంల గోదాము చుట్టూ ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాకినాడ అర్బన్ తహసీల్దారు జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దారు జగన్నాథం, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



విజేతలకు కలెక్టర్ అభినందన

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సురేష్‌నగర్‌లో గల జాయ్ ఇంగ్లిషు మీడియం హైస్కూల్లో 3వ తరగతి చదువుతున్న కంకటాల నిహారిక, 4వ తరగతి చదువుతున్న కారే మోక్ష ఆదిత్య, 8వ తరగతి చదువుతున్న కారే రేవంత్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. వారిని కలెక్టర్ షాన్‌మోహన్ అభినందించారు. స్కూలు ప్రతినిధులు గుత్తుల సుశీల, కొవ్వాడ నాగేశ్వరరావు, సాపే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు



అయ్యప్పమాలధారులకు భిక్ష

తాళ్లరేవు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి మాలధారులకు జడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్‌సాగర్ దంపతులు తాళ్లరేవు అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం అన్నప్రసాదం పంపిణీ చేశారు. సుమారు 400 మంది స్వాములు భిక్ష స్వీకరించారు. చిట్టూరి చలపతి, పొన్నాడ భైరవమూర్తి, పెట్ల సూర్యనారాయణ, మహేంద్ర, భాస్కరశర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సర్పవరం జంక్షన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వార్షిక మరమ్మతుల నిమిత్తం ఇంద్రపాలెం సెక్షన్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంద్రపాలెం, చీడిగ, కొవ్వాడ, గంగనాపల్లి గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

'దుర్గాడను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా'

గొల్లప్రోలు రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దుర్గాడను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం ఆయన గ్రామంలో పర్యటించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరణ, వర్మీకంపోస్టు తయారీ తదితర అంశాలను అధికారులు వివరించారు. శ్మశానవాటిక వద్ద శుభ్రపరిచిన డంపింగ్ యార్డు ప్రాంతంలో మొక్కలు నాటారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఫైవ్‌మెన్ కమిటీ సభ్యుడు ఓదూరి కిషోర్, జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసంలో పిఠాపురం నియోజకవర్గ అధికారులతో ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే దొరబాబు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు సమావేశమయ్యారు. జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం వారు జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలతో సమావేశమయ్యారు.



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

పెనుమర్తిలో మెగా రక్తదాన శిబిరం

సర్పవరం జంక్షన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ పెనుమర్తిలోని శ్రీకిరణ్ కంటి ఆసుపత్రిలో వ్యవస్థాపకుడు డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రోటరీ బ్లడ్ బ్యాంకు సహకారంతో గురువారం ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరాన్ని జేఎన్టీయూకే వీసీ చేకూరి శివరామకృష్ణ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్రోహుల దుశ్చర్యతో విమాన ప్రమాదంలో అశువులుబాసిన శ్రీకిరణ్ పుట్టిన రోజైన నవంబరు 20న ఆసుపత్రి ఫౌండర్స్ దినోత్సవంగా జరపడం గర్వకారణమన్నారు. రక్తదానంపై అపోహలు వీడాలని, శ్రీకిరణ్ ఆసుపత్రి ఫౌండర్స్ డే రోజున మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం ఆనందంగా ఉందని డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదిత్య డిగ్రీ కాలేజీ, శారదా విద్యాలయం, శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి సిబ్బంది, డాక్టర్లు, వివిధ కళాశాలల విద్యార్థుల నుంచి 240 యూనిట్ల రక్తం సేకరించారు. జేఎన్టీయూకే స్టూడెంట్స్ ఎఫైర్స్ డైరెక్టర్ డాక్టర్ ఎ.కృష్ణమోహన్, రోటరీ చైర్మన్ డాక్టర్ ముత్తా నవీన్‌కృష్ణ, సెక్రటరీ నల్లమిల్లి మాచారెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రటరీ కె.శివకుమార్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్, జేఎన్టీయూకే వీసీ ప్రసాద్

భీమేశ్వరాలయంలో మహాన్నదానం

సామర్లకోట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస ముగింపును పురస్కరించుకుని సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో గురువారం మహాన్నదానం నిర్వహించారు. సామర్లకోట, పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 5వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. అంతకు ముందు భీమేశ్వర స్వామికి, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు), ప్రతినిధుల పర్యవేక్షణలో విశేష పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సీఐ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు నిర్వహించారు. కాగా శుక్రవారం భీమేశ్వరస్వామిని వెండి ఝటాజూటంతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తామని ఈవో నీలకంఠం చెప్పారు.

'ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి పెట్టాలి'

గొల్లప్రోలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ సూచించారు. ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు జిల్లా మేనేజరు జె.ఎలియాజర్, రైతులు, అధికారులు గురువారం ఎంపీని కలిశారు. ప్రకృతి పద్ధతుల్లో పండించిన పండ్లు, ఇతర ఉత్పత్తులను ఆయనకి అందజేశారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ప్రస్తుతం వీటికి ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని రైతులను మరింతగా ఇటువైపు ప్రోత్సహించాలని ఎంపీ సూచించారు.

'భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి'

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ బిల్డింగ్, అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కలెక్టర్ షాన్ మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిట్ల శ్రీను, రొంగల ఈశ్వరరావు, నాయకులు తెలగరెడ్డి జీవ, ఆకుల సత్యనారాయణ, వెల్లంకి సత్యనారాయణ, చీకట్ల సాంబశివ, నీరం సత్తిబాబు, కొల్లి సత్తిబాబు, బోరా సత్తిబాబు, వీరబాబు, ఆనందరావు, డేగల సత్యనారాయణ, విశ్వనాథం, గడిగట్ల సత్తిబాబు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

శంఖవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శంఖవరంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పర్వత సురేష్, గ్రంథాలయ అధికారి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

తక్షణమే పోలవరం పరిహారం ప్రకటించాలి

● జలవనరుల శాఖ మంత్రిని కలిసిన నిర్వాసితులు



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న పోలవరం నిర్వాసితులు

కూనవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తమ గ్రామాలకు తక్షణమే పోలవరం పరిహారం ప్రకటించాలని కూనవరం మండలంలోని కరకగూడెం పంద్రాజుపల్లి కొత్తూరు గ్రామస్థులు రాష్ట్ర జనవరిలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిశారు. ప్రతి ఏడాది వరదల కారణంగా తమ గ్రామాలు ముంపునకు గురవుతున్న ప్రాధాన్యం గ్రామాలలో కలపలేదని వారు మంత్రికి తెలిపారు. వెంటనే తమకు పోలవరం పరిహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గడేసుల రంజిత్‌కుమార్ కరకగూడెం సర్పంచ్ వెంకన్న బాబు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'పరిహారం ఇప్పించండి'

చింతూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సకాలంలో పోలవరం పరిహారం, పునరావాసం కల్పించాలని కోరుతూ చింతూరు ఐటీడీఏ ముందు గురువారం నిర్వాసితులు బారులు తీరారు. వీరిలో వరరామచంద్రపురం మండలంలోని వడ్డిగూడెం, రాజుపేట నిర్వాసితులు తమ సమస్యలను పోలవరం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వడ్డిగూడెం 41.15 కాంటూరు స్థాయిలో ఉన్నప్పటికీ ఇళ్ల నష్టపరిహారం చెల్లింపుల్లో జాప్యం జరుగుతుందని వాపోయారు. అదేదశలో తమకుపునరావాసం కల్పించాలని రాజుపేటవాసులు కోరారు.

డొంకరాయిలో సిమ్మెంటు రోడ్లకు శంకుస్థాపన

మోతుగూడెం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):బొడ్డగండి (మేజర్) గ్రామ పంచాయతీ పరిధిలో14, 15వ ఆర్థిక సంఘం నిధులతో వివిధ గ్రామాల్లో చేపట్టే సిమ్మెంటు రోడ్లపనులకు గ్రామపం చాయతీ సర్పంచ్ వేమ సంధ్యారాణి శ్రీకారం చుట్టారు డొంకరాయి గ్రామం సినిమాహాల్ వీధిలో సర్పంచ్, ఎంపీటీసీ కరకా వెంకటరమణతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా వస్తున్న నిధులను గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాలకు, వీధిలైట్లు, మంచినీరు, సిమ్మెంటు రోడ్లు, పారిశుద్ధ్య పనులకు వెచ్చించి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ వెంకటరమణ మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే కూటమి ప్రభుత్వాలు ఉన్నాయని రాష్ట్రంలో ఉన్న అన్ని స్థానిక సంస్థలకు ఒకే విధంగా ఎటువంటి పక్షపాతం లేకుండా, స్థానిక సంస్థల ప్రజాప్రతిని ధులైన సర్పంచ్‌లు, ఎంపీపీలు, జిల్లాపరిషత్ చైర్మన్‌లు ప్రజాల నుంచి గౌరవం పొందే విధంగా నిధులు మంజూరుచేస్తూ గ్రామాల అభివృద్ధికి పూర్తి సహకారం అంది స్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాగ్ జయదాస్, వార్డు మెంబెర్ నీలాపు సత్యనారాయణ, గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి ఎన్.రఘుబాబు, మాజీ ఉపస ర్పంచ్ గంగిరెడ్ల గురుమూర్తి, రాజు, ధను, రాము పాల్గొన్నారు.

బాల్య వివాహాల రహిత గ్రామాల ఏర్పాటుకు కృషి

ఎటపాక, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల రహిత గ్రామాల ఏర్పాటుకు గ్రామస్థాయి ఉద్యోగులు కృషి చేయాలని మండలస్థాయి బాల్య వివాహ నిర్మూలన కమిటీచైర్మన్, తహసీల్దార్ కె.శ్రీనివాస్ అన్నారు. గురువారం ఎటపాక మండల పరిషత్ కార్యాలయంలోఐసీడీఎస్ సీడీపీవో అరుణ అధ్యక్షతన బాల్యవివాహాల నిర్మూలనకై చేపట్టాల్సిన చర్యలపై కార్యక్రమంను నిర్వహించారు. ప్రతీనెలా మొదటి శుక్రవారం గ్రామస్థాయిలో నిర్వహించే అవగాహన కార్యక్రమంలో గ్రామస్థాయి సిబ్బంది పాల్గొని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్ఐ జి అప్పలరాజు మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన చట్టంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో నాగమణి, ఎంఈవో నరియం రాజులు, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం వెలిపై ఖండన

రంపచోడవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నరసాపురం మెటల్ క్వారీ బాంబ్ బ్లాస్టింగ్‌లతో నివాసగృహాలు కూలిపోయే స్థితికి వచ్చాయని తమకు న్యాయం చేయాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారికి దరఖాస్తు చేసుకున్న కుటుంబాన్ని గ్రామస్థులు వెలివేయడంపై ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ఖండించారు. బాధితులకు న్యాయం చేయాలని జాతీయ మానవ హక్కులు, జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్‌లకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. గిరిజనేతరుల మాటలు విని ఆదివాసీలు ఐక్యతను కోల్పోకూడదని, సోషల్ బైకట్ వంటి దుర్మార్గమైన చర్యలు మానుకోవాలని హితవు పలికారు.

'సాంకేతిక సమస్యను అధిగమిస్తున్నాం'

చింతూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల విలీనం నేపథ్యంలో చోటుచేసుకున్న సాంకేతిక సమస్యను అధిగమిస్తున్నా మని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ అనకాపల్లి రీజినల్ మేనేజరు సతీష్ చంద్ర పేర్కొన్నారు. గురువారం చింతూరు బ్రాంచిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. బ్యాంక్‌ల విలీనం తదుపరి కొంతమేర సాంకేతిక సమస్య చోటుచేసుకుందన్నారు. ఈ ఏడాది డిసెంబరు చివరితేదీ వరకు పాతా ఖాతా నంబర్ల ద్వారానే నగదు లావాదేవీలు జరుపుకోవచ్చు అన్నారు. ఐఎఫ్ఎస్‌సీ కోడ్ మార్పు జరిగింద న్నారు. అయినప్పటికీ నగదు లావాదేవీలకు ఎటువంటి సమస్య లేదన్నారు. ఇక పోలవరం పరిహారం జమ విషయంలో కొంతమేర సాంకేతిక సమస్య చోటుచేసుకోవడంతో ఆ సమస్యను అధిగమించే చర్యలు ముమ్మరం చేశామన్నారు. ఈ సమాచారం పోలవరం అధికారులకు, ఐటీడీఏ పీఓకు తెలియజేశామన్నారు. వారు ఇచ్చిన సూచనల మేరకు త్వరలో తమ బ్యాంకు ఖాతాదారుల అకౌంట్లలో పరిహారం సొమ్ములు జమ అవుతా యన్నారు. కార్యక్రమంలో చింతూరు బ్రాంచి మేనేజరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇందుకూరుపేటలో అవగాహన ర్యాలీ

దేవీపట్నం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):భారత తపాలా శాఖ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ద్వారా అందుబాటులో ఉన్న వివిధ పొదుపు పథకాలు, అతి తక్కువ ప్రీమియంతో ప్రమాద బీమా, జీవిత బీమా సేవలపై గురువారం రంపచోడవరం సబ్ డివిజన్ ఆధ్వర్యంలో ఇందుకూరుపేట పరిసర ప్రాంతాల్లో తపాలా శాఖ అధికారులు ప్రత్యేక రోడ్ షో, అవగాహన సదస్సును నిర్వహించారు. రంపచోడవరం సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.తాతు నాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రజల ఆర్థిక భద్రత కోసం తపాలా శాఖ విప్లవాత్మక మార్పులు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.పి.ఎం. సురేష్, మెయిల్ ఓవర్సీర్ పి.నరసింహం, బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలి

వీఆర్‌పురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) ఈనెల 24న చింతూరులో జరిగే సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సున్నం రాజులు అన్నారు. గురువార ం రేఖపల్లి సెంటర్‌లో అమరవీరుల స్థూపం వద్ద ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి ప్రచార కార్యక్రమం ప్రారంభించారు. ఈక్రమంలోనే శ్రీరామగిరి, చొక్కనపల్లి, జీడిగుప్ప, ముద్దులగూడెం తదితర గ్రామాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమం లో మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, ఎంపీటీసీ సభ్యుడు పూనెం ప్రదీప్‌కుమార్, పంకు సత్తిబాబు, కె. సత్తిబాబు, జి. లక్ష్మణరావు, వీర్ల నాగేశ్వరా వు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

కూనవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. టీడీపీ నాయకురాలు మాజీ జడ్పీటీసీ శ్రీమతి కన్యకా పరమేశ్వరి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యారులకు బహుమతి ప్రధానం చేశారు.

వై.రామవరం(ఆంధ్రజ్యోతి):వై.రామవరం శాఖా గ్రంథాలయ ంలో వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా లైబ్రేరియన్ సత్యవతి ఆధ్వర్యంలో ముగింపు సమావేశం నిర్వహించారు. వ్యాస రచన, చిత్ర లేఖనం, డ్రాయింగ్ వంటి పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

కార్యకర్తలు ఏకాభిప్రాయంతో ముందుకుసాగాలి

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు



తేటగుంటలో యనమలతో సమావేశమైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

తుని రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు ఏకాభిప్రాయంతో ముందుకుసాగాలని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పష్టంచేశారు. తేటగుంట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తేటగుంటకు చెందిన నాయకులు, కార్యకర్తలతో యనమల సమావేశం నిర్వహించారు. గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. యనమల మాట్లాడుతూ కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేయాలని, స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకుసాగాలని తెలిపారు. అనంతరం టీడీపీ మండలాధ్యక్షుడు అబ్బాయి ఆధ్వర్యంలో తేటగుంట గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరగా యనమల పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోతుకూరి వెంకటేష్, తేటగుంట మాజీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు, గజ్జి రాంబాబు, చామంతి సత్తిబాబు, సిగిరెడ్డి సత్తిబాబు, గొర్ల వీరబాబు, గజ్జి రమణ ఉన్నారు.

వాసవి క్లబ్స్ సేవా కార్యక్రమాలు



దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

జగ్గంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్, వాసవి క్లబ్ వనిత, వాసవి క్లబ్ బీటెక్ యూత్ సర్వసభ్య సమావేశం జగ్గంపేట వాసవి క్లబ్ అధ్యక్షుడు మానేపల్లి రామానుజ అధ్యక్షతన నిర్వహించారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుళ్ళ రామకృష్ణ గుడ్ విల్ విజిట్ 2025 కార్యక్రమంలో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మరో ముఖ్యఅతిథిగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ గవర్నర్ మానేపల్లి బంగార్రాజు, రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్, జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షుడు కొత్త కొండబాబు హాజరయ్యారు. గుడ్ విల్ విజిట్ కార్యక్రమంలో భాగంగా పలు సేవా కార్యక్రమాల్లో భాగంగా బీపీ, షుగర్ వ్యాధి గుర్తింపు వైద్య శిబిరం నిర్వహించారు. ఎంబీబీఎస్ చదువుతున్న పేద విద్యార్థినికి రూ.15,000 ఆర్థిక సాయం అందించారు. ఇంద్రపాలెంలో గల శ్రీ గోపాల గో సంరక్షణ సంఘానికి రూ.50వేలు వితరణ చేశారు. వాసవి మనోనేస్తం మనో దివ్యాంగం సహాయం కింద మానసిక దివ్యాంగులకు దుప్పట్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఐఇసి ఆఫీసర్ నాళం ఆండాళ్, క్యాబినెట్ సెక్రటరీ మామిడిపాక సతీష్, క్యాబినెట్ ట్రెజరర్ కంచర్ల వెంకట సత్యనారాయణ, ఐపీసీ బొండా వీర సత్య నారాయణమూర్తి, ఐపీసీ గ్రంధి నాగబాబు, మతంశెట్టి నారాయణ, మతంశెట్టి లావణ్య, ఉద్దగిరి కామేష్, మానేపల్లి యామిని, బొండా అయ్యప్ప, నిట్టల శ్రీనివాస్ ఉన్నారు.

కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పరామర్శ

గండేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో యర్రంపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ముత్యాల సత్యనారాయణ తల్లి ముత్యాల సరస్వతి ఇటీవల మరణించారు. విషయం తెలిసిన రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ గండేపల్లి మండలాధ్యక్షుడు పోతుల మోహన్ రావు గురువారం యర్రంపాలెం గ్రామంలోని ముత్యాల సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పేదలకు అడ్డుకొండ భూములను పంచాలి



గోపాలపురంలో నిరసన తెలుపుతున్న రైతుకూలీ సంఘం నాయకులు

గండేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం మల్లిసాల రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్న 583 ఎకరాల అడ్డుకొండ భూమిని దశాబ్దాలు కాలంగా పోరాడుతున్న ప్రజలకు కాకుండా ఇండస్ట్రియల్ పార్క్ పెట్టాలన్న ఆలోచనలను విరమించుకోవాలని.. మల్లిసాల, గోపాలపురం గ్రామానికి చెందిన పేదలకే పంచిపెట్టాలని డిమాండ్ చేస్తూ గండేపల్లి మండలం గోపాలపురంలో గురువారం ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైతు కూలీలు నిరసన తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ అడ్డుకొండ భూమిలో ఇండస్ట్రియల్ పార్కు అంగీకరించబోమన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.రమేష్, వల్లూరి రాజబాబు, సహాయ కార్యదర్శి కడితి సతీష్, కుంచె అంజిబాబు, బోడకుర్తి అబ్బులు, వెంకటేశు, కృష్ణ, పోచమ్మ, అప్పారావు పాల్గొన్నారు.

వైభవంగా హారతులు



కిర్లంపూడిలో హారతి ఇస్తున్న దృశ్యం

కిర్లంపూడి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగియడంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు గ్రామల్లో వేకువ జామున నుంచి ఆలయాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. గురువారం కిర్లంపూడి ఉమా వైద్యనాధీశ్వర ఆలయంలో ప్రధాన అర్చకులు నారాయణమూర్తి శర్మ వైద్య నాధం ఆధ్వర్యంలో ఏకాహ హారతి, బిల్వ, త్రిశూల, పంచ, కుంభ, నక్షత్ర, సింహ, నాగ, షష్టి హారతులు నిర్వహించారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కుమారుడు ము ద్రగడ గిరిబాబు దంపతులు ప్రారంభించారు. భక్తులు భారీగా తరలివచ్చారు.

గౌరీశంకరుల ఉత్సవాలు



భక్తులకు దర్శనమిస్తున్న గౌరీశంకరులు

తుని రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తునిలో గౌరీశంకర్ల మహోత్సవాలు వైభవంగా జరిగాయి. పల్లపు వీధిలో గౌరీశంకర సమేత వీరభద్ర స్వామి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు వేద పండితులు విశ్వనాధ శర్మ తీర్థప్రసాదాలు అందించారు.

పెరటి తోటల పెంపకంపై మహిళలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కిర్లంపూడి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రకృతి వ్యవసాయం, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రామకృష్ణాపురం గ్రామంలో మహిళలకు పెరటి తోటల పెంపకంపై అవగాహన, శిక్షణ నిర్వహించారు. రామకృష్ణాపురం అంగన్‌వాడీ టీచర్ డి.మేరి గ్రేస్, బి.శిరోమణి అవగాహన కల్పించారు. 30 మంది మహిళలకు రిలయన్స్ ఫౌండేషన్ 11రకాల విత్తనాలను అందించింది. రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ బర్రె నాగేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వరలక్ష్మి, డి.రాజు, భవాని, రిలయన్స్ ఫౌండేషన్ సిబ్బంది యు.రమేష్ బాబు, రైతులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

కిర్లంపూడి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేలంక గ్రామ శివారు పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్ తన సిబ్బందితో దాడి చేశారు. ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి నుంచి రూ.9,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేశారు.

నీలాద్రిరావుపేటలో ముగ్గురు..

గండేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలాద్రిరావుపేట గ్రామ శివారు పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు సిబ్బందితో దాడి చేశారు. ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5,300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

'అరెస్ట్ చేసిన మావోయిస్టులను కోర్టులో హాజరుపరచాలి'

ప్రత్తిపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ నేత హిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీతో సహా అరెస్ట్ చేసిన వారందరినీ కోర్టులో హాజరుపరచాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. మారేడుమిల్లిలో జరిగిన ఎదురు కాల్పులపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశాయి. సీపీఎల్, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ, సీపీఐ ఎంఎల్, ఎంసీపీఐ(యు), సీపీఐ ఎంల్ లిబరేషన్, ఎస్‌యూసీఐ (సి) ఫార్వర్డ్ బ్లాక్, రివొల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ నేతలు వి.శ్రీనివాసరావు, జి.ఈశ్వరయ్య, పి.ప్రసాద్, జాస్తి కిషోర్‌బాబు, కాటం నాగభూషణం బుగతా బంగార్రావు, ఎం.రామకృష్ణ, వీఎస్ అమర్నాథ్, పీవీ సుందర రామరాజు, జానకి రాములు గురువారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. మారేడుమిల్లి ఏజెన్సీలో జరిగిన వరుస ఎన్‌కౌంటర్లలో హిడ్మాతో సహా 13 మంది మావోయిస్టులు మృతి చెందారని, అటవీ ప్రాంతంలో మావోయిస్టులను నిర్బంధించి తరువాత కాల్చి చంపారన్నారు. నిర్బంధించిన మావోయిస్టులు, వారి అనుచరులను న్యాయస్థానాల్లో ఉంచాలని కోరారు. కేంద్రం తలపెట్టిన ఆపరేషన్ కగార్‌తో దండకారుణ్య ప్రాంతాన్ని రక్తసిక్తం చేస్తోందని వామపక్ష నేతలు విమర్శించారు. ఆపరేషన్ కగార్ ను వెంటనే ఆపాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు.



ఆలయానికి తరలి వెళుతున్న వేద పండితులు

వైభవంగా ఆలయ శిఖరాల కుంభాభిషేకం

571 కలశాలతో మహిళల శోభాయాత్ర

శంఖవరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కత్తిపూడి శివారు ఉన్న విశాలక్షి సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయం వద్ద 13వ మహా కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఘంటశాల సోమేశ్వర శర్మ ఆధ్వర్యంలో తిరుపతి నుంచి వచ్చిన వేద పండితులు, ఆలయ అర్చకులు ధర్మకర్త మంచాల సత్యనారాయణ చేతులు మీదుగా పూజలను నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు ముందుగా మహాగణపతి పూజ, నవగ్రహ మండపారాధన చేపట్టారు. 571 అఖండ కలశాలతో రుద్రపారాయణ జపం, మహాకుంభ, రుద్ర హోమం చేపట్టారు. సప్తనదుల జలాల కలశాలతో మహిళలు ఊరేగింపు నిర్వహించి అనంతరం ఆలయ శిఖరాలకు కుంభాభి షేకం జరిపారు. పండితులు రుద్రాభిషేకాలు, పూర్ణాహుతి చేపట్టారు.

పాఠశాల అభివృద్ధికి కృషి



పెద్దనాపల్లి పాఠశాలకు మైకు సెట్టు అందజేస్తున్న ఎంపీపీ బుజ్జి

ఏలేశ్వరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అవసరమయ్యే అన్ని వసతులు సమకూర్చి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. పెద్దనాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన శ్రీ సీత ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ ఆర్థికసాయంతో సమకూర్చిన మైకు సెట్టును ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌కు ఎంపీపీ బుజ్జి, టీడీపీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ సభ్యుడు శెట్టి వెంకట అప్పారావు, సుంకర సత్తిబాబు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



ధారాపల్లి జలపాతం వద్ద యువకుల సందడి

జలపాతాల వద్ద సందర్శకుల సందడి

ప్రత్తిపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జలపాత ప్రాంతాలు గురువారం సందడిగా మారాయి. కార్తీక మాసం ముగుస్తుండడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో ధారపల్లి, ఎరకంపాలెం జలపాత ప్రదేశాలు కోలాహలంగా మారాయి. ఈ రెండు జలపాతాల వద్ద పర్యాటకులు స్నానాలు చేస్తూ సందడి చేశారు. ఎరకంపాలెం కొండ దిగువన ఉన్న ధారా మల్లికార్జునస్వామిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ధారపల్లి వద్ద మండల సచివాలయ ఉద్యోగుల వన సమారాధన జరిపారు. ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో కాశీవిశ్వనాథ్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వేణుగానంలో ప్రావీణ్యం ఉన్న ఎంపీడీవో కుమార్‌బాబు ఫ్లూట్‌తో సినీ గేయాలు ఆలపిస్తూ అలరించారు. ఉద్యోగులు క్రీడల్లో పాల్గొని ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు నాగమణి, వీరబాబు, లక్ష్మీనారాయణ, మహేష్, మధు, సిబ్బంది అరుణ్, తేజ, నాగార్జున, శ్రీను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో పూర్తిగా కుంగిన వంతెన

ప్రమాదం అంచున ప్రయాణం.. ఆదమరిస్తే కాలువలోకే..

• ఏలేశ్వరంలో కుంగిన వంతెనతో అవస్థలు • పట్టించుకునే నాథుడే లేడు

ఏలేశ్వరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం పరిధిలోని ఏలేరు కాలువపై నిర్మించిన వంతెన కూలిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కుంగిన వంతెనపై వెళ్లడానికి భయంగా ఉన్నా గత్యంతరం లేదని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. ఏలేశ్వరం అప్పన్నపాలెం మధ్య ఏలేరు ప్రధాన కాలువపై ఉన్న వంతెన ఏలేశ్వరం-జగ్గంపేట మండలాల మధ్య రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తు న్నారు. రైతులకు, వ్యాపారస్తులకు, ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడే ఈ వంతెన వైసీపీ అధికారంలో ఉండగానే కుంగినా పార్టీ నాయకులెవ్వరూ పట్టించుకోలేదు. వైసీపీ నాయకుల నోట అభివృద్ధి అనే ఊసే లేకపోయింది. గతంలో రూ.98 లక్షలతో పంచాయతీరాజ్ శాఖ ఈ బ్రిడ్జి నిర్మించింది. కుంగి సుమారు నాలు గేళ్లయినా నేటికీ చక్కదిద్దినేలేదు. ఏలేశ్వరం, జగ్గంపేట మండలాల్లో పలు గ్రామాలకు హైవే ఎక్కనవసరం లేకుండా ఈ వంతెన ద్వారా దగ్గర దారి అవుతుంది. ఏలేరు జలాశయం నుంచి నీరు విడుదల చేస్తే ఆ జలాలు ప్రాజెక్టును విడిచాక మొదటిగా ఈ బ్రిడ్జినే దాటాలి. ఆ తర్వాత కిర్లంపూడి, పిఠాపురం, గొల్లప్రోలు, పెద్దాపురం మండలాల ఆయకట్టుకు నీరు ప్రవహిస్తుంది. ఈ వంతెన వెంబడి రెయిలింగ్ దెబ్బతింది. రాత్రి సమయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా నీటి ప్రవాహంలోకి జారిపోతారు. ఏలేశ్వరంలో అప్పనపాలెం వార్డు వంతెన అవతల ఉండడంతో స్కూల్, కళాశాల, నగర పంచాయతీ, మార్కెట్, వగైరా పనుల కోసం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రోజూ కాలినడకన రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణంపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రత్తిపాడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఒమ్మంగి గ్రామంలో పేద కుటుంబానికి ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీ ఆర్థికసాయం అందించారు. గ్రామంలో చుక్కా చంటిబాబు ఆకస్మికంగా మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో గంటా పెదబాబు, ముమ్మిడి వీరబాబు, గంటా బుజ్జి, సుంకర తమ్మారావు, చిట్టిబాబు, నూకరాజు పాల్గొన్నారు.

బాలికల వసతిగృహంలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రత్తిపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని దీప్తి బాలికల వసతిగృహంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జరిగిన ఈ సదస్సులో ప్యానల్ అడ్వకేట్‌లు బొంగుశూరి మధుబాబు, అవసరాల దేవి.బాలికలకు చట్టపరంగా లభించే హక్కులు తదితర అంశాలను వివరించారు. అనంతరం బాలికలకు సరఫరా చేస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ఎం.శైలజారాణి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ఏలేశ్వరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణ శాఖతో పాటు, లింగంపర్తి గ్రామంలోని గ్రంథాలయాల్లో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ వారోత్సవాల్లో గ్రంథాలయ పాలకులు కవికొండ సత్యనారాయణ, సరేళ్ల తరుణ్ కుమార్ విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, వందేమాతరం నినాదం తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు టీడీపీ మండలాధ్యక్షుడు జ్యోతుల పెదబాబు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.